# ఆదర్శ జంట

## గోనుగుంట మురళీకృష్ణ

•••

టీవీ స్టూడియోలో “ఆదర్శ జంట” పోటీలు జరుగుతున్నాయి. ఫస్ట్‌ఫ్లోర్ ఎంట్రన్స్‌లో “ఆదర్శ జంట పోటీలకు వచ్చే జంటలకు స్వాగతం” అనే బ్యానర్ కట్టి ఉంది. బయట గేట్‌లో నుంచి కార్లు రయ్యిన లోపలికి వస్తున్నాయి. అప్పటికే అనేక కార్లు పార్క్ చేసి ఉన్నాయి.

గేటు దగ్గరనుంచి హాలుమెట్ల వరకూ ఆకు పచ్చటి తివాచీ పరచి ఉంది. అటూ ఇటూ కూలర్లు సువాసనభరితమైన చల్లగాలిని విర జిమ్ముతున్నాయి. అప్పుడు ఉదయం పదిగంటలైనా ఎండలేకుండా ఆకాశం మబ్బుపట్టి చల్లగాలి వీస్తోంది.

పోటీలకు వచ్చిన జంటలతో పాటు విజిటర్స్ కూడా గుంపులు గుంపులుగా లోపలికి వస్తున్నారు. ఆడవాళ్లు రకరకాలైన మోడ్రన్ దుస్తులతో, కొంతమంది చీరలతో, నగలతో మిలమిలా మెరిసిపోతున్నారు. అందరూ అందంగా, ఆరోగ్యంగా ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఊరికే అందంగా అలంకరించుకుని వస్తే చాలదు. వారి ప్రతిభను ప్రదర్శించేటట్లు పాటపాడటమో, డాన్స్ చేయడమో, జోక్స్ చెప్పడమో ఏదో ఒకటి చేయాలి. లేదా యాంకర్స్ ఏవో ఫన్నీ గేమ్స్ ఇస్తారు.

ఆ కార్యక్రమం నిర్వహించే యాంకర్ సుమ, ఆమె భర్త రాజీవ్ అప్పటికే వచ్చి ఉన్నారు. “సుమా! మీ ఇద్దరూ యాంకర్స్ అయిపోయారు గానీ, కాంపిటీషన్‌లో పాల్గొంటే ఫస్ట్ ప్రైజ్ ఖచ్చితంగా మీకే వచ్చేది” ఒకామె అంది.

“వావ్” అంటూ ఇద్దరూ పెద్దగా అరిచి, ఫకాలున నవ్వి “థ్యాంక్యూ! థ్యాంక్యూ!” అన్నారు.

పోటీలు ప్రారంభమయ్యాయి. పాల్గొనే జంటలను యాంకర్స్ వరుసగా పిలుస్తున్నారు. కొంచెం దూరంలో స్టేజికి ఒక పక్కగా ఆర్కెస్ట్రా వారు కూర్చుని హుషారైన మ్యూజిక్ వాయిస్తున్నారు.

“ఈ కాంపిటీషన్‌లో పాల్గొనే తర్వాత జంట యశ్వంత్, సమీర” ఎనౌన్స్ చేసారు.

యశ్వంత్, సమీర వచ్చారు. ఆడియన్స్ అందరూ సైలెంట్ అయిపోయి వాళ్లవంకే ఆసక్తిగా చూస్తున్నారు.

సమీర నెమలి పింఛం రంగు చీర కట్టుకుంది. దాని అంచు బంగారు రంగు పూలతీగలతో అందంగా కన్పిస్తోంది. జుట్టు దువ్వి జడవేయకుండా వదిలివేసింది. చెవి పక్కన గులాబీ ఉంది. నగలు పెట్టుకోవటం మర్చిపోయిన రాజకుమార్తెలా ఉంది సమీర. యశ్వంత్ తెల్లటి ప్యాంట్, నల్లటి షూస్ వేసుకున్నాడు. పల్చటి షర్టులోనుంచి కండలు తిరిగి ఆ


గ్యంగా ఉన్న శరీరం కనిపిస్తోంది.

"మౌనంగానే ఎదగమనీ మొక్కనీకు చెపుతుంది..." యశ్వంత్, సమీర పాట మొదలు పెట్టారు. వాయిద్యాలు మ్రోగుతున్నాయి. పాట అయిపోయింది. చప్పట్లతో ఆ హాలు మారు మ్రోగిపోయింది.

"ఇప్పుడు కొద్దిసేపు బ్రేక్. అనంతరం విజేతల వివరాలు ప్రకటించబడతాయి" యాంకర్ చెప్పింది.

ప్రేక్షకులు ప్రక్కవాళ్లతో కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంతమంది సెల్‌ఫోన్‌లో మాట్లాడటానికి బయటకు లేచి వెళుతున్నారు.

కొద్దిసేపయిన తర్వాత ప్రోగ్రామ్ మళ్లీ మొదలయింది. "ఈనాటి "ఆదర్శ జంట" విజేతలకు ప్రముఖ సినీనటి జయప్రద బహుమతులు అందజేస్తారు. ప్రథమ బహుమతి పొందిన జంట - యశ్వంత్, సమీర..."



ప్రేక్షకుల చప్పట్లమధ్య యశ్వంత్, సమీరలు జయప్రద చేతిమీదుగా మెమెంటో అందుకున్నారు. వెంటనే కెమేరాల ఫ్లాష్‌లు మెరుపుల్లాగా మిరమిట్లుగొలిపాయి. తర్వాత మిగిలిన విజేతలకు కూడా బహుమతులు ఇచ్చారు. ప్రోగ్రామ్ ముగిసింది. అందరూ వెళ్లిపోతున్నారు.

"కారు తీసుకుని నువ్వు ఇంటికి వెళ్లు. నాకు పనుంది... తర్వాత వస్తాను" ఫ్రెండ్ కారులో కుర్చుంటూ అన్నాడు యశ్వంత్. సమీర తలూపింది.

ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం రెండయింది. బట్టలు మార్చుకుంది. "భోజనం వడ్డించాను రండమ్మా!" పనిమనిషి పిలిచింది.

సమీర డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చింది. అన్నం, కూరలు అన్నీ గాజు బౌల్స్‌లో ఉన్నాయి. ఒకవైపు అప్పుడే ఫ్రిజ్‌లో నుంచి తీసిన మామిడిపళ్లు, యాపిల్స్, ద్రాక్ష, చక్రకేళీలు ఉన్నాయి. సమీర అన్నం ముందు కూర్చుంది.

యశ్వంత్ బయటకు వెళ్లాడు. ఎప్పటికి వస్తాడో? బయటికి వెళ్లిన మనిషి ఇంటికి వచ్చేసరికి రాత్రి పన్నెండు కావచ్చు, ఒంటిగంట కావచ్చు, నాలుగైనా కావచ్చు... చెప్పలేం.

పెళ్లిచూపులలో యశ్వంత్‌ని చూసి అందరూ మెచ్చుకున్నారు. డబ్బు కలవాడు, అందగాడు, ఎటువంటి బాదరబందీ లేనివాడు... సమీర అదృష్టవంతురాలు అన్నారు. పెళ్లిలో ఇద్దరూ రతీమన్మధుల్లాగా ఉన్నారు అన్నారు.

తర్వాత తర్వాత అర్థమైంది. ఐశ్వర్యం ఉంది – దేనికీ లోటు లేదు... సమీర సుఖంగా ఉంది అన్పిస్తుంది బయటివాళ్లకి. కానీ యశ్వంత్‌కి వ్యాపారం, తాగుడు, స్నేహితులు, ఎన్నో వ్యాపకాలు. ఇంటిదగ్గర సమీర ఎదురుచూస్తుందన్న విషయమే గుర్తుండదు. సమీరా ఎం.ఏ చదివింది. కానీ సంపాదించాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఒంటరిగా అతనికోసం ఎదురుచూస్తూ ఉంటుంది.

ఎదురుచూసీ చూసీ పదకొండు, పన్నెండు గంటలకి కాస్త కునుకుపడుతుంది. అప్పుడు వస్తాడు యశ్వంత్. మెలకువ వచ్చిన సమీర ఇష్టాఇష్టాలతో పనిలేకుండా తన కోరిక తీర్చుకుని నిమిషాల మీద నిద్రపోతాడు. మళ్లీ నిద్ర పట్టదు సమీరకు. తెల్లవారుఝాముదాకా ఆలోచిస్తూ కుర్చుని ఎప్పుడో తెలతెలవారేటప్పుడు నిద్రలోకి జారిపోతుంది. మెలకువ వచ్చి చూసేసరికి పక్కన అతనుండడు. స్నానం చేసి రడీ అయి వెళ్లిపోతాడు. రైల్వేస్టేషన్‌లో ఒకదాని తర్వాత ఒకటి వచ్చేపోయే రైళ్లలాగా ఉంటాయి వారి నిద్రలు.

ఇద్దరూ కలసి భోజనం చేయాలని, సరదాగా ఎక్కడికైనా వెళ్లాలని, ఆత్మీయంగా కబుర్లు చెప్పుకోవాలనీ ఉంటుంది సమీరకు. ఆమె అభిప్రాయాలు గమనించే ప్రయత్నమైనా చేయడు యశ్వంత్. మానసికంగా దగ్గరగా ఉంటే శారీరకంగా ఎంత దూరమైనా భరించగలదు సమీర. బయట మాత్రం ఆదర్శజంట. ఇంట్లోని ఆదర్శ దాంపత్యం ఇది!

ఆలోచిస్తున్న సమీరకు అన్నం తినబుద్ధికాలేదు. ప్లేట్లో చెయ్యి కడిగేసింది. తన గదికి వచ్చింది. టీ.వీ. ముందు కుర్చుని రిమోట్‌తో టీ.వి. ఆన్ చేసింది. ఒకడు పెద్దకొండ చిలువ నోరు పట్టుకుని జుగుప్సాకరంగా తెరిచి చూపిస్తున్నాడు. ఛానల్ మార్చింది. చిన్న చిన్న బట్టలు వేసుకుని విదేశీ సుందరీమణులు వయ్యారాలు ఒలకపోస్తూ ర్యాంప్ మీద నడుస్తున్నారు. మళ్లీ ఛానల్ మార్చింది. అత్తాకోడళ్లు కోపంతో రగిలి

పోతూ సవాళ్లు విసురుకుంటున్నారు. మరో ఛానల్లో ఒకడు స్నేహితుడి భార్యకు లైన్ వేస్తు న్నాడు ఎదురింటి బాల్కనీలో నిలబడి.

చిరాగ్గా టీవీ ఆఫ్ చేసింది సమీర.

వచ్చి పడుకుంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంటికీ, జైలుకీ తేడా ఏముంది? అక్కడా ఒంటరితనం. ఇక్కడా వంటరితనం. కాకపోతే ఇంట్లో అన్ని సౌకర్యాలూ ఉంటాయి.

సమీర లేచి కిటికీ దగ్గరకు వచ్చి నిలబ డింది. క్రింద సర్వెంట్ క్వార్టర్స్ ఉన్నాయి. చివ రిగా ఉన్న పోర్షన్ దగ్గర తులశమ్మగారు గిన్నెలు కడుగుతోంది. కాకులు అక్కడక్కడా వాలి ఉన్నాయి.

రెండు నెలలక్రితం షాపింగ్‌కి వెళ్లి ఏమీ తోచక బస్టాండ్ దగ్గరకు వచ్చింది సమీర. కాస్త మనుషులు కనిపిస్తూఉంటే కాలక్షేపంగా ఉం టుందని. నిదానంగా, తీరికగా అటూ ఇటూ తిరుగుతూంటే ఒకచోట ఇద్దరు వృద్ధ దంప తులు ట్రంకుపెట్టి దగ్గరపెట్టుకుని పల్లెటూరి రకంగా భయంగా, బెంగగా కూర్చుని కన్పిం చారు.

పరధ్యానంగా వాళ్లను దాటి రెండడుగులు వేసిన సమీర ఉలిక్కిపడి వెనుదిరిగి చూసింది. ఆయన్ను పరీక్షగా చూస్తూ "మీరు... మీరు... కాంతారావు మాష్టారు కదూ!" అంది.

"అవునమ్మా! నువ్వెవరు?" అడిగాడు.

"నేను మాష్టారూ! మీ స్టూడెంట్‌ని. చిన్న ప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో చదువు కునేట ప్పుడు మీరు నాకు పాఠాలు చెప్పారు" అన్నది.

"అలాగా! నీ పేరు ఏమిటి? ఏం చేస్తున్నావు ఇప్పుడు?" అడిగాడాయన. "నా పేరు సమీర. 'లా' చదివాను కానీ ప్రాక్టీస్ చేయడంలేదు. ఇక్కడే జూబ్లీహిల్స్‌లో ఉంటున్నాను. మీరు ఊరువెళుతున్నారా!" అడిగింది సమీర.

కాంతారావుగారి ముఖంమీద నీలినీడలు కమ్ముకున్నాయి. అవునన్నట్లు తలూపాడు.

"ఏ ఊరు?"

ఆయన సమాధానం చెప్పలేదు. శూన్యం లోకి చూస్తూ ఊరుకున్నాడు.

"ఏ ఊరండీ!" మళ్లీ అడిగింది.

"ఏ ఊరు వెళతాం తల్లీ! ఈ ప్రపంచంలో తలదాచుకోవటానికి మాకు చోటు లేదు. మాకు ఎవరూలేరు... ఎవరూలేరు" మాష్టారుగారి భార్య అంది. అంటూండగానే ఆమె కళ్లల్లో నుండి జలజలా నీళ్లు జారాయి.

సమీర మనసు ఎలాగో అయింది. "మంచి వాళ్లకి ప్రపంచంలో చోటు ఎప్పుడూ ఉంటుం దండీ! మా ఇంటికి రండి మాష్టారూ! ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే దానికి పునాది ప్రాథమిక విద్యే! మీ మూలంగానే నేను ఈ రోజు ఇలా ఉన్నాను. నా మాట కాదనకండి. కొద్దిరోజులు మా ఇంట్లో ఉండండి. ఆ తర్వాత ఉండలేననుకుంటే అప్పుడే వెళ్లవచ్చు" అంది.

"నిజమేనండీ! ప్రస్తుతం మనం ఎక్కడో అక్కడ ఉండవలసిందేగా!" అంది ఆయన భార్య తులశమ్మగారు.

"మీ వాళ్లు ఊరుకుంటారా?" అడిగాడు.

"మా వాళ్లు ఏమీ అనరు. రండి" అంది.

కాంతారావుగారు నిట్టూర్చి లేచి నిలుచు న్నారు. ముగ్గురూ వెళ్లి కారులో కూర్చున్నారు.

ఇంటికి వచ్చారు. ఇంద్రభవనం లాంటి

ఆ ఇల్లు, వైభోగం చూసి కాంతారావు చకితుడయ్యాడు.

సమీర గది ఏర్పాటుచేయమని పనిమనిషికి చెప్తూంటే "ఆ ఇంట్లో ఉంటామమ్మా!" దూరంగా సర్వెంట్ క్వార్టర్స్ చూపిస్తూ అన్నాడు.

"అవి పనివాళ్ల కోసం కట్టినవండీ!" అంది.

"ఫర్వాలేదు. ప్రస్తుతం మా స్థాయికి అవే ఎక్కువ" అన్నాడు.

సమీర ఎంత చెప్పినా ఆయన వినలేదు. చివరికి ఒప్పుకుంది.

ఆ రోజు రాత్రి భర్తకు జరిగినదంతా చెప్పింది. ఆవలిస్తూ "సరే! ఉండనీ!" అని నిద్రకు ఉపక్రమించాడు యశ్వంత్.

తర్వాత మెల్లగా కాంతారావు వాళ్ల కథ తెలిసింది. ఆయన రిటైరై పదేళ్లయింది. ఒక్కడే కొడుకట. కష్టపడి పెంచి పెద్ద చేసి ఇంజనీరింగ్ చదివించారు. కోడలు కూడా ఉద్యోగమే! కాంతారావు వాళ్లు కొడుకు దగ్గరే ఉంటున్నారు. మొదట్లో బాగానే చూసారు. క్రమక్రమంగా కోడలు చిరాకుపడటం మొదలుపెట్టింది. "మా పిల్లలకి చేయటానికే టైమ్ లేక ఛస్తూంటే ఈ ముసలాళ్ల పీడ ఒకటి నాకు" అనేది. కొడుకు విని కూడా ఊరుకున్నాడు. ఇక అక్కడ ఉండలేక భార్యాభర్తలిద్దరూ చెప్పకుండా ఇల్లు వదిలి వచ్చేసారు.

కిటికీ దగ్గర నిలబడి ఆలోచిస్తున్న సమీర ఇవతలకి వచ్చింది. "ఒక్కసారి మాష్టారు దగ్గరికి వెళ్లివద్దాం" అనుకుంది. సమీర అప్పుడప్పుడూ వెళ్లి వాళ్లని చూసి వస్తుండేది. వాళ్లిద్దరికీ ఒకరంటే ఒకరికి చెప్పలేని అభిమానం. తులశమ్మగారి మాటలు చాదస్తంగా ఉన్నా ఎంతో ఆదరంగా, సహృదయంగా మాట్లాడుతుంది. అక్కడికి వెళ్లి మాట్లాడి వచ్చినప్పుడల్లా రిలాక్సింగ్ ఉంటుంది. మెమెంటో తీసుకొని బయలుదేరింది సమీర.

"రామ్మా! రా! ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం" నవ్వుతూ ఆహ్వానించింది తులశమ్మ.

"అమ్మాయికి కూడా భోజనం వడ్డించవే!" అన్నారు కాంతారావుగారు.

"వద్దండీ! కొద్దిసేపు కుర్చుని వెళదామని వచ్చాను" అంది సమీర.

"ఫర్వాలేదు రామ్మా! గోంగూర పచ్చడి, వంకాయ వేపుడు, సాంబారు చేసాను. మన పెరట్లో కాసినవే. గోంగూర పచ్చడి నీకిష్టం కదా! అది చేస్తుంటే నువ్వు ఎన్నిసార్లు గుర్తుకొచ్చావో చెప్పలేను".


సమీర కాదనలేకపోయింది. తులశమ్మ చాపవేసి, అరిటాకులో అన్నం వడ్డించింది. తులశమ్మ కొసరి కొసరి వడ్డిస్తూంటే సమీర తనకు తెలియకుండానే తినేసింది. అంతక్రితం డైనింగ్ టేబుల్ దగ్గర తినబుద్ధి కాలేదన్న విషయమే గుర్తుకు రాలేదు.

భోజనం పెడుతూ తులశమ్మ కబుర్లలో పడింది.

"అమ్మాయ్! నీకు పెళ్లయి ఎన్నేళ్లయింది?" అడిగింది.

"నాలుగేళ్లు అయింది".

"నాలుగేళ్లు అయినా నీ కడుపున ఒక కాయ కాయలేదంటే ఏ గాలో, ధూళో సోకే ఉంటుందమ్మా! సంతాన గోపాలస్వామి గుడిచుట్టూ నూటొక్క ప్రదక్షిణలు చేసి, నాలుగు శనివారాలు ఉపవాసం ఉంటానని మొక్కుకో! కడుపు పండుతుంది" అంది.




సమీర నవ్వి, "అలాగేనండి!" అన్నది.

భోజనం చేస్తూనే మెమెంటో చూపించి ఉదయం జరిగిన ఫంక్షన్ గురించి చెప్పింది సమీర.

"విన్నావటే! అమ్మాయికి 'ఆదర్శ జంట' పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందట" అన్నారు కాంతారావుగారు.

"అలాగా!" అంది తులశమ్మ.

భోజనం అయిపోయింది. సమీర వారిస్తున్నా వినకుండా ఆకు తీసివేసి, డస్ట్‌బిన్‌లో పడేసి, అక్కడంతా శుభ్రం చేసింది తులశమ్మ.

సమీర, కాంతారావు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"నా దిగులంతా ఒక్కటేనమ్మా! నేనున్నంత వరకూ ఫర్వాలేదు. నేను కాస్తా పోతే ముసలమ్మని ఎవరు చూస్తారు?" అన్నాడు.

"మీరు కాసేపు వాకింగ్‌కి వెళితేనే వదలి ఉండలేను. మీరు లేని ఈ లోకంలో నాకేం పని? మీతోపాటే నేనూ వచ్చేస్తాను" అంది తులశమ్మ.

సమీర మనసు భారంగా అయిపోయింది. కొంచెం సేపు కూర్చుని, "వెళ్లి వస్తానండీ!" అంది.

"అమ్మాయ్! మెమెంటో మర్చిపోయావు" అందిస్తూ అంది తులశమ్మ.

"ఊహు. అది నా దగ్గర ఉంచుకోవటానికి నాకు అర్హత లేదు. మీ దగ్గర ఉండటమే కరెక్ట్. ఎవరైనా ఈ మెమెంటో మీ దగ్గర చూసినప్పుడైనా "ఆదర్శ జంట" అనే మాటకు సరైన అర్థం తెలుసుకుంటారేమో!" అంది సమీర.

"ఏమిటో! ఈవిడ మాటలు నాకు ఎప్పుడూ అర్థంకావు..." ఆమె వెళుతున్నవైపే చూస్తూ చిన్నగా అనుకుంది తులశమ్మ. ●